# తడి మంటలు

**- కన్నెపల్లి చలమయ్యశాస్త్రి**

''మా కాలేజి ఎడ్యుకేషన్ టూర్‌కి డబ్బు చెల్లించాల్సింది రేపేనమ్మా! ఇంతవరకూ నువ్వు అక్కని డబ్బు అడగలేదు. నేను పేరు ఇచ్చేసాను. రేపు ఏ మొహంతో కాలేజికి వెళ్లేది?''

చిన్నపిల్లాడిలా మారాం చేస్తున్న కొడుక్కి ఎలా చెప్పాలో అర్థం కాలేదు విశాలకి. వాడి గోల చిరాకు కలిగిస్తోంది.

''ఎవర్నడిగి పేరిచ్చావ్‌రా? ఇంట్లో డబ్బు మూలుగుతోందనుకున్నావా?'' నిరసనగా చూసి విసురుగా జవాబిచ్చాడు హరీష్. ''ఇంత చిన్నపాటి కోరికలు తీర్చలేనప్పుడు నన్ను కాలేజీలో చేర్చారెందుకు? ఏ సినిమాహాల్లోనో గేటుకీపరుగా నాపొట్ట పోషించుకోలేక పోయేవాడినా?''

విశాల మనస్సు చివుక్కుమంది. ఏదో జవాబు చెప్పబోయింది. అది విన్పించుకోక హరీష్ వెళ్లిపోయాడు.

వీడినేనా కాన్వెంట్ డ్రెస్‌లో స్కూలుకెళ్లేటప్పుడల్లా మైమరిచి చూసేదితను!

''వీడ్ని ఢిల్లీ పంపించి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో చదివిస్తాను. ఐయేఎస్ చేస్తాను'' అని మురిసిపోయేవాడు భర్త.

ఆ మాట వింటున్నప్పుడు ఏదో రంగులకల చూస్తున్నట్టుండేది.

అలాటి కలల్లోనూ, భ్రమల్లోనే తన జీవితం గడిచిపోయింది.

ఆఫీసుకు బయల్దేరిన భర్త సిటీబస్సు ప్రమాదంలో అకస్మాత్తుగా మరణించాక గానీ తమ స్థితిగతులేమిటో తెల్సిరాలేదు.

పెన్షన్ లేని ఉద్యోగం భర్తది. కంపెనీ ఏదో కంపెన్సేషన్ ఇచ్చి చేతులు దులుపుకుంది. క్వార్టర్ విడిచిపెట్టాల్సి వచ్చింది. బ్రతుకు రోడ్డు మీద పడడం అన్న సత్యం అనుభవంలో తెల్సింది.

రేపటి గురించి ఆలోచన లేకపోవడం, ఒక్క వ్యక్తి సంపాదనమీదనే కుటుంబం ఆధారపడడం- రెక్కలు విరిచిన పక్షుల్లా విలవిల లాడాల్సివచ్చింది.

అప్పటికే ఇంటర్ మీడియెట్ పూర్తిచేసి ఇంట్లో తెలుగు నవలల్ని చదువుతూ ఊహల్లో ఊరేగే కూతురు పద్మినిపై బరువు బాధ్యతలు పడ్డాయి.

తెల్సినవాళ్ళ కాళ్ళు పట్టుకున్నాక, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో టైపిస్ట్ ఉద్యోగం దొరికింది. వెల్లువలో చిక్కుకున్న ప్రాణికి దొరికిన గడ్డి పోచలాటి ఆధారం.

పద్మిని తర్వాత హరీష్- బి.కాం రెండో సంవత్సరం చదువుతున్నాడు.

తర్వాత పావని- తొమ్మిదో తరగతి.

భర్త బ్రతికే వుంటే, పద్మినికి పెళ్లయి అత్తారింటికి తరలిపోయేదే!

దాని ఈడు అమ్మాయిలంతా పెళ్లిళ్లయి ముచ్చటగా కాపురం చేస్తున్నారు. వాళ్ళని చూస్తుంటే మనస్సు కెలికిన పుండులా సలుపుతుంటుంది.

''మమ్మీ- నా స్కూలు డ్రెస్ ఇరుకయింది. కొత్తడ్రెస్ కుట్టించమని ఎన్ని రోజులై చెప్తున్నాను?'' పావని మాటలతో ఉలిక్కిపడింది విశాల.

చాలీచాలని బట్టల్లో, శరీరం పొదుగుతున్న ఆడతనాన్ని దాచుకునే విఫల ప్రయత్నంలో విసిగిపోయిందా అమ్మాయి.

''కుట్టిద్దామమ్మా- అక్కకి ఈనెల జీతాలందగానే...''

''అబద్ధం. నువ్వు కుట్టించవు. మూడు నెలలై ఇదేమాట చెప్తున్నావు. నువ్వడగలేకపోతే చెప్పు, నేనే అక్కని అడుగుతాను. ఈ ఇరుకు బట్టల్తో రోడ్డుమీద నడుస్తుంటే'' దుఃఖం, అవమానం గొంతు పట్టేస్తుంటే మాట పూర్తి చేయలేకపోతోంది పావని.

''సర్దుకోవాలమ్మా- అనుకోగానే- అన్నీ చేసెయ్యాలంటే మనబోటి వాళ్ళకు సాధ్యమా?'' అనునయించబోయింది విశాల.

వెళ్ళబోతున్నదల్లా ఒక్కక్షణం ఆగి, తల్లికేసి నిరసనగా చూస్తూ అంది పావని. ''గుమ్మం దాటిన దగ్గర్నుండి- జాంపండు పాపాయని పోకిరీ వెధవలు కూస్తున్నా సర్దుకుపోవాలా?'' అంకురిస్తున్న నవయవ్వనాన్ని, ఆగని ఆడతనాన్ని పుస్తకాల వెనుక దాచే ప్రయత్నంలో ముడుచుకుపోతూ రోడ్డెక్కింది పావని.

ఈ పిల్లలో పేదతనాన్ని లేక ఆడతనాన్ని చూసే పోకిరీ కళ్లని తలచుకుంటే భయం వేసింది విశాలకి. ఇవన్నీ వినడానికి, చూడడానికే బ్రతికివుందాతను?

తనూ, భర్తా, ముచ్చటగా ముగ్గురు పిల్లలు- స్వర్గసీమలాటి తన కుటుంబం, కించిత్ భోగం అనుభవించి ముక్కలైన బ్రతుకులోని యదార్థం ఆమెను కలవరపరుస్తున్నాయి.

నిన్న- గడిచిపోయిన రంగుల కల.

నేడు- గడవలేని చిక్కుల వల.

రేపు.. అంతర్లీనంగా ఏదో ఊరట.

ఈ కష్టాలు మాత్రం శాశ్వతమా? రేపు హరీష్ కాలేజి చదువు పూర్తయి, ఎక్కడో ఉద్యోగం దొరికితే- పద్మినికి పెళ్లిచేసి అత్తారింటికి పంపెయ్యదూ?

ఇక శేషజీవితానికి ఒడిదుడుకులేవుంటాయి?

గడియారం పదకొండు గంటలు కొట్టడంతో ఉలిక్కిపడింది విశాల.

పద్మినికి క్యారేజి పంపే వేళయింది. సైకిలబ్బాయి ఈ క్షణంలోనో, మరో క్షణంలోనో వస్తాడు. ఆలోచనల్లోంచి విముక్తి పొందినదానిలా వంటింట్లోకి నడిచింది.

సరిగ్గా అయిదు నిముషాలయ్యేలోగానే కాలింగ్ బెల్లు గణగణ మ్రోగింది.

తలుపుతీసింది విశాల. సరోజ! పద్మిని హైస్కూలు క్లాస్‌మేట్. హాస్పిటల్ డ్యూటీ అయిపోయింది కాబోలు, ఇంకా నర్సు డ్రెస్సులోనే ఉంది.

''పద్మ ఆఫీసుకు వెళ్లిపోయిందా పిన్నిగారూ?'' అంటూ ఇంట్లోకి వచ్చింది.

నెలకోమారు అకారణంగా విచ్చేసే ఈ అమ్మాయంటే సదభిప్రాయం లేదు విశాలకి. ఎవరో కుర్ర డాక్టరుతో ప్రేమాయణం సాగిస్తోందని ఊరూవాడా అనుకోవడం తెలుసు.

అకారణంగానే ఆమెపై సదభిప్రాయం లేదు. తాచెడ్డకోతి వనమంతా చెరిచినట్టు ఈమె పద్మినిని చెడగొట్టదుకదా! అయినా, ఈ నర్సుతో పద్మినికేం స్నేహం? మతీ, సుతీ లేకపోతే సరి-

చొరవగా పద్మిని గదిలోకి నడిచి, మంచం మీద కూచుంది.

''పిన్నిగారూ- కాసిన్ని మంచినీళ్లు ఇస్తారా?'' అడిగింది.

విశాల వంటింట్లోంచి గ్లాసుతో నీళ్లు తెచ్చింది. గడగడా నీళ్లు త్రాగేసి లేచింది.

''పద్మిని వస్తే నేనొచ్చివెళ్లినట్టు చెప్పండి'' అందిలేస్తూ. ఆమె వెళ్లిపోయాక, అలుముకున్న దుర్గంధం దూరమయిన భావన కల్గింది విశాలకు.

వంటింట్లోకి నడిచి క్యారేజి సర్దింది. సరిగ్గా అప్పుడే సైకిలబ్బాయి వచ్చాడు.

ఇంట్లోకి చూస్తూ అరిచినట్టు చెప్పాడు. ''అమ్మాయిగారు ఆఫీసు డ్రాయరు తాళాలు ఇంట్లోనే మరచిపోయేరట. తీసుకురమ్మని చెప్పారు.''



విశాల అతడికి క్యారేజీ అందించి, పద్మిని గదిలోకి నడిచింది.

టేబిలుమీద, అలమారాలోనూ వెతికింది. తాళం గుత్తి దొరకలేదు.

పరుపు ఎత్తి చూసింది. అక్కడ కన్పించింది తాళం గుత్తు!

దానితోపాటు-

సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోయింది విశాలకు.

సైకిలబ్బాయికి తాళాల గుత్తి ఇచ్చేసి, గడియపెట్టి పద్మిని గదిలోకి నడించింది మళ్లీ. ఆ గదిలోకి అడుగుపెట్టడాన్కి బిడియంగానూ, కంపరం గానూ ఉంది. ఇందాక తను చూసినది అబద్ధమయితే బావుండుననే భావనతో మరోసారి పరుపు ఎత్తి చూసింది.

ఈ పాపాన్ని చూడ్డానికే కళ్ళు ఉన్నట్టు- ఇంకా అలానే ఉందా ప్యాకెట్, గర్భనిరోధక మాత్రలు.

పద్మిని చెడిపోయిందన్న దానికి సరోజ రాక ఊపిరినిస్తే, ఈ ప్యాకెట్ నిర్ధారించింది.

రెండు నెలలై పద్మిని ఆఫీసు నుండి లేటుగా వస్తోంది.

52వ పేజీ చూడండి

25వ పేజీ తరువాయి

''ఈరోజు ఇన్‌స్పెక్షనుందమ్మా- లేటయింది'' అని ఒకరోజు-

''హెడ్ క్వార్టర్‌కి అర్జెంట్‌గా పేపర్లు టైపుచేసి పంపాల్సివచ్చింది, అందుకే ఆలస్యమయింది-'' అని మరోరోజు-

''మా కొలీగ్‌కి బదిలీ అయింది, ఫేర్‌వెల్ పార్టీవల్ల లేటయింది'' అని ఇంకోరోజు-

''మా స్నేహలత నిద్రమాత్రలు మింగింది. ప్రాణం మీదికొచ్చింది. హాస్పిటల్‌కి వెళ్ళాల్సివచ్చింది'' అని మరొకరోజు-

తన ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చేది మొదట్లో. రాన్రానూ అది అలవాటుగా మారిపోయింది. ఆలస్యంగా వచ్చేరోజు పద్మిని చిర చిర నడుచుకుంటూ తన గదిలోకి వెళ్లిపోతుంది. ఒక్కోరోజు తింటుంది, ఒక్కోరోజు తినదు, మాట్లాడదు.

రోజురోజుకీ తమ మధ్య దూరం పెరిగిపోతోంది.

ఏమైనా అడిగితే చివ్వున విరుచుకుపడ్తుంది. పెళుసుగా మాట్లాడుతుంది. తప్పదు కాబట్టి- తను సర్దుకుపోతూ ఉంది.

దాని ప్రవర్తనలో మార్పుకు అసలు కారణం ఇదన్నమాట? పద్మిని ఇంతలా బరితెగిస్తుందని, దిగజారిపోతుందని అనుకోలేదు.

విశాలకు దుఃఖం ముంచుకొస్తోంది. దుఃఖంతోపాటు విపరీతమయిన అసహ్యం. ఈరోజు తేల్చుకోవాలి, నిలదీసి అడిగెయ్యాలి.

అక్కర్లేదు- దీనికీ, దీని ఉద్యోగానికీ నమస్కారం.

నాలుగిళ్ళలో పాచిపని చేసుకున్నా, నలుగురు పిల్లలకి ట్యూషన్ చెప్పుకున్నా రోజులు గడిచిపోతాయి. ఆత్మగౌరవానికి లోపం రాని ఏపైనా చేసి పొట్టపోషించుకోవచ్చును.


పద్మినిని ఈ జారుడు మెట్లంబడి కాపాడకపోతే, రేపు పావని అదే మెట్లు ఎక్కుతుంది. ఇక కొడుకు రౌడీగానో, లోఫర్‌గానో మారడాన్కి ఎంతోకాలం పట్టదు కూడా!

తన కలలన్నీ కరిగిపోతాయి. నలుగురూ వేలెత్తి చూపిస్తారు.

అస్తవ్యస్తమయిన ఆలోచనలతో మనసు కలతబారింది.

సాయంత్రమయింది.

పనిమనిషి సీతాలు వచ్చింది. అలవాటు ప్రకారం అంట్లు




తోముతూ వీధిలో వార్తలు మోసుకొచ్చింది. ఎదురింటి వనజాక్షి కూతురు కాలేజి పిక్నిక్ పేరుతో రెండురోజులు ఎవడితోనే తిరిగి వచ్చిందట. అవతలి వీధి సదానందమూర్తి ఇంట్లో ఇన్‌కమ్‌టాక్స్ రెయిడింగ్ జరిగిందట. నల్లడబ్బు కన్నా విచిత్రమైనవి, నీలి కాసెట్లులు దొరికాయట.

రోజూ అదలా చెప్పడం, తను చెవులప్పగించి వినడం పరిపాటే అయినా ఈరోజు విసుగ్గా, తలనొప్పిగా ఉంది.

తనచుట్టూరా పెరిగిపోయిన పాపాల పుట్టల్లో ఎన్ని విష సర్పాలు దాగి ఉన్నాయో! సందు దొరికితే ఇవన్నీ కాటు వెయ్యక మానవు.

ఆరింటిదాకా ఏవేవో కబుర్లు చెప్తోంది సీతాలు.

''అమ్మాయిగారు ఇంకా ఇంటికి రాలేదేమిటమ్మా?'' అని ఒకటికి రెండుసార్లు అడిగింది.

కొంప మునిగింది.

ఇది లేనిపోనివి కల్పించి చుట్టుప్రక్కల ప్రచారం చెయ్యదుకదా!

పరువు బజారున పడడాన్కి- ఇంకా ఎక్కువ రోజుల్లేవు.

అయినా, దానినునుకుని ఏం లాభం? ఒడిలో కట్టుకున్న నిప్పు పొగ చిమ్మక మానుతుందా, మంటలు రాక తప్పుతుందా?

కొంచెం సేపు తచ్చాడి సీతాలు వెళ్లిపోయింది. అది వెళ్లినా, దాని మాటలు చెవిలో మారుమోగుతూనే ఉన్నాయి.

చీకటి ముసిరింది.

వీధి దీపాలు వెలిగాయి.

పావని సంగీతం క్లాసునుండి వచ్చేసింది.

హరీష్ కూడా క్రికెట్ ఆడి ఇంటికి వచ్చాడు.

ఏడయింది.

ఎనిమిదయింది.

పిల్లలిద్దరూ భోజనాలు చేసి చదువుకుంటున్నారు.

తొమ్మిదయింది. చదువులు ముగించి పడుకున్నారు.

పది కావస్తోంది.

ఎవరి దినచర్యతోనూ తనకేమీ ప్రమేయం లేనట్టు, నిముషాలను నెట్టుకుంటూ గంటల్ని మోసుకొంటూ నడుస్తోంది కాలం.

పదిన్నర.

ఏమయింది. పద్మినికేమయింది?

ఎక్కడో ఏక్సిడెంట్ జరగలేదు కదా?

ఎవరితోనో- ఉడాయించ లేదు కదా??

ఛీఛీ, ఎలాటి వక్రమైన ఆలోచనలు?!

జరక్కూడనిదే జరిగితే- ఈ కుటుంబం ఏమవుతుంది?

భయం, సంశయం, దుఃఖం, ఆదుర్దా కలగాపులగమై మనస్సు కకావికలమవుతోంది.

భగవంతుడా- నా కూతుర్ని రక్షించు, ఈ ఇంటిని కాపాడు.

పదకొండు గంటలప్పుడు-

ఇంటిముందు ఏదో కారు ఆగిన శబ్దం.

గదిలో లైటు ఆర్పేసి కిటికీలోంచి చూసింది విశాల.

పరుచుకున్న స్ట్రీట్‌లైట్ వెల్తుర్లో కార్లోంచి దిగుతూ స్పష్టంగా కన్పించింది పద్మిని.

దాని నీడ జీబురు భూతంలా



## శ్రీదేవి ప్లస్ సునీత

సవతుల కొట్లాట ప్రస్తుతానికి చల్లారినట్టే కనిపిస్తోంది. సునీతాకపూర్ ప్రస్తుతం శ్రీదేవితో కలసి మెలసి వుండాలని అభిలషిస్తోంది. ఆమధ్య సునీత 'శ్రీ' కూతురు 'జాహ్నవి' ఆరోగ్యం కోసం కొన్ని సూచనలు చెప్పి పంపిందట. శ్రీ ఆ సూచనలు పాటించడంతో హుషారొచ్చిన సునీత డాక్టర్ రాజగోపాలన్ అనే వాస్తుసలహాదారుడిని తీసుకుని సవతి ఇంటికెళ్లిందట. వాస్తుసలహాదారు ఇంటికి కొన్ని మార్పులు చెప్పి అవి చేస్తే, బిడ్డకు మరింతా మేలు జరుగుతుందని చెప్పడంతో సవతులిద్దరూ కలసి ఆ ఇంటికి మార్పులు చేర్పులు చేయబోతున్నారట. అయినా ఆమధ్య శ్రీదేవి మీద అంతగా ఎగిరిపడిన సునీత ఇప్పుడు శ్రీదేవి మీద, ఆమె బిడ్డ మీద అంతగా ప్రేమ చూపడానికి కారణం ఏమిటి?! బోనీకపూర్ సర్దుబాటా?! లేక 'శ్రీ' మీద పెరిగిన అభిమానమా?!...అదేంకాదు, ఆర్థికపరమైన కారణాలే సునీతలో మార్పు రావడానికి కారణమని కొందరు చెవులు కొరుక్కుంటున్నారు. నమ్మదగిన విషయమే మరి!

-జె.వి.బాబు

వరండా మీదికి పడుతోంది.

కారు కిటికీలోంచి బయట కొచ్చిన మగ తల 'గుడ్‌నైట్' చెప్పింది పద్మినికి.

ఒకటికి రెండుసార్లు 'గుడ్‌నైట్' చెప్పింది పద్మిని.

కారు వెళ్లిపోయింది.

తన దగ్గరున్న తాళం చెవితో 'నైట్ లాచ్' తెర్చి ఇంట్లోకి వచ్చిన పద్మిని తల్లిని గమనించలేదు. తలుపు బడాలున లాగేసి చిర చిరా తన గదిలోకి నడిచింది. హేండ్‌బ్యాగ్ టేబిల్ మీద విసిరేసి, బెడ్‌మీద మంచానికడ్డంగా వాలిపోయింది. ఉదయం ఎప్పుడో కట్టుకున్న బట్టలు కూడా మార్చుకోవాలన్న ధ్యాస లేదు.

ఈరోజుకిక ఇంతే. ఎక్కడో తినేసి వచ్చింది.

ఇందాక ఆమె రావడంలో జాప్యమయినందుకు కలిగిన ఆతృత, ఆందోళనలు మాయమై ఇప్పుడు అసహ్యం చోటు చేసుకుంది.

దీని పాపిష్టి డబ్బుతో తన పిల్లల బ్రతుకు సవ్యంగా రూపుదిద్దుకుంటుందా?

ఒద్దు, అడగను.

దీనికీ, దీని డబ్బుకీ శతకోటి నమస్కారాలు.

తన గదిలోకి నడిచింది విశాల. హఠాత్తుగా ఆమె దృష్టి పావనిపై పడింది. గుండెలమీద తొలగిన దుప్పటి పావని యవ్వనాన్ని బహిర్గతం చేస్తోంది.

అనాచ్ఛాదితమై, ఇరుకుల్లోంచి, చిరుగుల్లోంచి కన్పిస్తున్న ఆమె పచ్చని శరీరం ఒక్కక్షణం నిలవరింపచేసింది. గుండెల్లో కలుక్కుమంటూ బాధ తన్నుకొచ్చింది.

దుప్పటి సర్దింది. పొద్దున్న స్కూలుకెళ్తూ పావని అన్నమాటలు గుర్తొచ్చాయి. తుంటరివాళ్ళ దృష్టి దీనిపై పడనే పడింది. తండ్రిలేని పిల్ల, తప్పుదారి బట్టిన అక్క- దీన్ని ఎవరు రక్షించగలరు?

లేదు, దీనినైనా ఈ పాముల నుండి కాపాడుకోవాలి.

ఏదో మహాశక్తి తననావరించినట్టు విసవిసా పద్మిని గదిలోకి నడిచింది విశాల.

లైటు వేసింది.

వెల్తురుకి చివాలున తలెత్తి చూసి విసుగ్గా అంది పద్మిని. ''నేను బయట తినేసివచ్చానమ్మా- నా గురించి చూడకు''

కూతురి మొహంలోకి సూటిగా చూడలేనట్టు తలదించుకుని కర్రాటలా నిల్చింది విశాల.

''ఏం కావాలమ్మా?'' కళ్ళు తెరిచీ తెరియక అడిగింది పద్మిని.

శరీరంలో శక్తినంతా కూడగట్టుకుని, తనలో తానే గొణుగుతున్నట్టు నెమ్మదిగా అడిగింది విశాల ''హరీష్‌కి ఎడ్యుకేషన్ టూరట. నాలుగొందలు రేపటిలోగా కావాలి. పావని స్కూలు డ్రెస్ ఇరుకయిపోయింది. కొత్తడ్రెస్ కుట్టించడాన్కి దానికో రెండొందలు-''

అసహనంగా మరో ప్రక్క ఒత్తిగిల్లి చెప్పింది పద్మిని. ''ఇవన్నీ చెప్పి నన్ను విసిగించకు. ఆ బ్యాగ్‌లో డబ్బుంది, నీ క్కావలసినంత తీసుకో! వెడ్తున్నప్పుడు లైటు తీసేసి మరీ వెళ్లు.''

కంపిస్తుండగా బ్యాగ్‌లోకి చేయి పెట్టింది విశాల.

కరకరలాడ్తూ తగుల్తున్న క్రొత్తనోట్లు కదుల్తున్న పాముపిల్లల్లా అన్పించాయి.

జారబోతున్న కన్నీటిబొట్టుని కనుకొలకుల్లో అదిమేసి నెమ్మదిగా డబ్బు తీసింది విశాల.

అభిమానాన్ని జయించిన అవసరాన్కి తలొంచింది ఆ తల్లి.

★ ★ ★

రాత్రి తర్వాత పగలు రాక తప్పదు.

పగలు వస్తూ తనతో సమస్యల్ని తీసుకురాకనూ మానదు.

రోజుకన్నా త్వరగా అంట్లు తోమడానికొచ్చింది సీతాలు.

''నిన్న సాయంత్రం నీగురించి చాలాసేపు చూసేనమ్మాయ్‌గారూ! ఆఫీసులో పని ఎక్కువయిందా?'' ఆరా తీస్తోంది పద్మినిని.

కూతురేం జవాబు చెపుతోందోనన్న ఆతృతతో గదిలోకి తొంగి చూసింది విశాల.

పద్మిని పరుపు ఎత్తి చూసింది. ''నీ కోసం సరోజ తెచ్చి ఇచ్చినట్టుందే, ఇదిగో- నీ మాత్రల ప్యాకెట్'' అంటూ సీతాలుకి అందించింది.

సీతాలు గభాలున దాన్ని జాకెట్లో పడేసుకుంది.

''అయినా ఇప్పటికే ఇద్దరు పిల్లలు నీకు. ఇంకెంతకాలం ఈ తిప్పలు పడ్తావే? నీ మొగుడికి నచ్చ చెప్పి ఆపరేషన్ చేయించుకోకూడదూ?''

సీతాలు ఏదో నెమ్మదిగా సణుగుతోంది.

''ఎక్కువగా ఈ మాత్రలు వాడ్డం మంచిదికాదే. ఎప్పుడైనా మర్చిపోయావంటే మళ్లీ పురిటి మంచం ఎక్కాల్సివస్తుంది.''


విశాల విద్యుద్ఘాతం తగిలినదానిలా విలవిలలాడింది.


గుండెలమీంచి ఏదో బరువు తీసేసినట్టు అన్పించింది.

మనిషికి ఆలోచనాశక్తి, తార్కిక జ్ఞానమిచ్చిన దేవుడు- ఎదుటి మనిషి నడవడిని గుర్తించే మరోశక్తి ఎందుకివ్వలేదో?

ఆలోచించలేనట్టు పెరట్లోకి నడిచింది విశాల అపరాధ భావంతో.

★



## బాలు డ్యాన్స్!

తియ్యగా పాడుతూ, ముద్దుగా డ్యాన్స్ చేసే 'యస్పీ' ఈసారి ఎన్టీఆర్, చిరంజీవి గెటప్‌లో కనిపించి, వారిలా నటించి మనల్ని హాయిగా నవ్వుకునేలా చేయబోతున్నారు. సాయిప్రకాష్ దర్శకత్వంలో వస్తున్న 'పెళ్లాడి చూపిస్తా' చిత్రంలో ఆయన ఓ డ్రీమ్‌సాంగ్‌లో రోజాతో కలసి 'ఆకుచాటు పిందె తడిసె...' పాటలో యన్టీఆర్ గెటప్‌లో, 'అబ్బనీ తియ్యనీ దెబ్బ...' పాటలో చిరంజీవి గెటప్‌లో కనిపించబోతున్నారు. బాలు ఎన్టీఆర్, చిరంజీవిలను అనుకరిస్తూ చేసే డాన్స్ ఆ చిత్రానికి హైలెట్ కాబోతుందంటున్నారు ఆ చిత్రదర్శకులు. హైలెట్ సంగతి పక్కన పెట్టినా, ఇతరులను ఇమిటేట్ చేస్తూ చేసే బాలు డ్యాన్స్ మనల్ని హాయిగా నవ్విస్తుందని మాత్రం చెప్పొచ్చు.

-జె.వి.బాబు